క్లుప్తంగా

డిగ్రీ కళాశాలకు కంప్యూటర్ కోర్సు మంజూరు

వెదురుకుప్పం : మండలకేంద్రంలో ఉన్న వైఎస్సార్ డిగ్రీ ప్రభుత్వ కళాశాలకు నూతనంగా కంప్యూటర్ కోర్సు మంజూరు చేయడం జరిగిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అన్నపూర్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు వైఎస్సార్ డిగ్రీ కళాశాలకు వెబ్ ఆప్షన్ పెట్టుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9885125771, 7702917803, 9704425888 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పట్టణంలోకి వాహనాల నిషేధం

నగరి : నగరిలో గంగజాతర సందర్భంగా మూడు రోజుల పాటు పట్టణంలోకి వాహన రాకపోకలు నిషేధిస్తున్నట్లు ఎస్ఐ సురేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12వ తేదీ నుంచి 14 వరకు నగరి గంగజాతర జరుగుతుంది. అందువల్ల ఓంశక్తి ఆలయం మీదుగా పట్టణానికి వచ్చే వాహనాలు నాగలాపురం జంక్షన్ రోడ్డు మీదుగా రావాలని సూచించారు. వాహనదారులు ఈ నిబంధనలు పాటించాలని కోరారు.

10 లీటర్ల సారా స్వాధీనం

విజయపురం (నగరి): సారా స్థావరంపై దాడి చేసి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. వివరాలు.. మంగళం గ్రామ సమీపంలో ప్రవీణ్‌కుమార్ అనే వ్యక్తి ఆదివారం సారా తయారు చేస్తుండగా దాడి చేసి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్


సీజ్ చేసిన ట్రాక్టర్లు

వెదురుకుప్పం: స్వర్ణముఖి నది నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ రమేష్ బాబు అన్నారు. వివరాలు.. మండలంలోని పచ్చికాపల్లం జంక్షన్ వద్ద ఆదివారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఇదే సమయంలో తిరుపతి జిల్లా దుర్గసముద్రం గ్రామానికి చెందిన కార్తీక్(25), దేవకుమార్ (29) ట్రాక్టర్లలో రామచంద్రాపురం మండల సమీపంలో ఉన్న స్వర్ణముఖి నది నుంచి ఇసుకను అనుమతి లేకుండా తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


స్వామివారి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

పెనుమూరు(కార్వేటినగరం) : పెనుమూరు మండల కేంద్రంలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద కృష్ణాష్టమి వేడుకలను శ్రీకృష్ణ కమిటీ ఆధ్వర్యంలో 5 రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రాధా, రుక్మిణీ సమేత శ్రీకృష్ణుడి ఉత్సవ మూర్తులను పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ క్రమంలో భాగంగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గోపూజ, హరికథా కాలక్షేపం భక్తులను ఎంతో ఆకట్టుకుంది. అలాగే మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో వేణుగోపాల్ యాదవ్, నరేష్, సుబ్రమణ్యం, మునిరత్నం పలువురు భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేడుకగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

పాలసముద్రం : మండలంలోని అరుణోదయ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఆదివారం హెచ్ఎం సుబ్రమణ్యం సమక్షంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చిన్నికృష్ణుడి వేషధారణలతో నృత్యాలు వేసి అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంగీత విద్వాంసులు దక్షిణామూర్తికి సన్మానం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేటు హోటల్లో ఆదివారం లయన్స్ క్లబ్ చిత్తూర్ గోల్డ్ మార్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫ్రంట్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ సంగీత విద్వాంసులు దక్షిణామూర్తిని సత్కరించారు. దీనికి ముఖ్య అతిథులుగా ఒలింపిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.కె.పురుషోత్తం, డిప్యూటీ క్యాన్ కమిషనర్ జాన్‌విక్టర్, ఆదాయపు పన్నుల శాఖ అధికారి వెంకటేష్ హాజరయ్యారు. వీరు మాట్లాడుతూ, 40 ఏళ్ల సినీ పరిశ్రమలో ప్రముఖ సంగీత విద్వాంసులుగా దక్షిణమూర్తి విశేష సేవలందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీడీనెల్లూరు ఎంపీడీవో శ్రీదేవి, తహసీల్దార్ ఇన్బనాథన్, పూతలపట్టు ఎంపీడీవో గౌరి, లయన్స్ క్లబ్ ప్రాంతీయ మేనేజర్ మోహన్‌రెడ్డి, రెడ్డెప్ప, ప్రభాకర్, రమణ, వెంకటేష్, మల్లికార్జున ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేకం

- లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఉత్సవాలు
- కుంభ కలశంతో ఆలయశిఖరం అధిరోహించిన మంత్రి ఆర్‌కే రోజా
- అభిషేక జలం కోసం పోటీపడిన భక్తులు


కుంభాభిషేక పూజల్లో మంత్రి ఆర్‌కే రోజా, సెల్వమణి దంపతులు


సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామిని దర్శించుకుంటున్న మంత్రి ఆర్‌కే రోజా దంపతులు

నగరి : మున్సిపల్ పరిధిలోని కరకంతాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీనారాయణస్వామి, శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తుల ఆలయ మహాకుంభాభిషేక వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి ఆలయంలో వేదపారాయణం ప్రారంభించారు. పెద్దఎత్తున యాగపూజలు నిర్వహించి గోపూజ, నాడీ సంధానం, ప్రాణప్రతిష్ట, పూర్ణాహుతి, కలశ పూజలు నిర్వహించారు.

పూజల్లో పాల్గొన్న మంత్రి రోజా..

కుంభాభిషేక పూజల్లో పాల్గొన్న రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక వ్యవహారాలు, యువజన సర్వీసులు, క్రీడా శాఖా మంత్రి ఆర్‌కే రోజా కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. యాగపూజలు అనంతరం నిర్వాహకులు సిద్ధం చేసిన శిఖర కలశ కుంభాభిషేక జలాన్ని మంత్రి రోజా తలపై ఎత్తుకుని ఆలయ ప్రదక్షిణ చేశారు. కలశంతో పాటు ప్రత్యేకంగా శిఖర గోపురం వరకు ఏర్పాటుచేసిన మెట్లపై నుంచి ఆలయ శిఖరం చేరుకున్నారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ సంప్రదాయబద్ధంగా శిఖర కలశానికి అభిషేకం చేశారు. ఆమె వెంట రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కేసెల్వమణి, మున్సిపల్ వైస్‌చైర్మన్ బాలన్, కౌన్సిలర్లు మురుగ, దయానిధి, ఇంద్రయ్య, కోఆప్షన్ సభ్యుడు ఎల్లప్ప రెడ్డి, తనికాచలం తదితరులు పాల్గొన్నారు. టీటీడీ ద్వారా శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తుల విగ్రహాలను ఇప్పించినందుకు గ్రామస్తులు మంత్రి రోజాకు ధన్యవాదాలు తెలిపారు.

అభిషేక జలం కోసం భక్తుల పోటీ..

కుంభాభిషేకం అనంతరం అభిషేక జలానికి భక్తులు పోటీపడ్డారు. ఆలయం చుట్టూ అభిషేక జలం వారిపై పడేలా నిల్చుని భగవంతున్ని ప్రార్థించుకున్నారు. అభిషేకానంతరం ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన శ్రీలక్ష్మీనారాయణ స్వామిని, శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తులను భక్తులు దర్శించుకుని కర్పూర హారతులు స్వీకరించారు. అభిషేక పూజల అనంతరం ఉత్సవ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

చట్టానికి ఎవరూ చుట్టం కాదు

అవినీతి ఆరోపణల నేపథ్యంలో మాజీ సీఎం చంద్రబాబు నాయుడిని ఏసీబీ అరెస్ట్ చేసిన విషయం విదితమే. సుమారు 36 గంటల పాటు ఉత్కంఠగా సాగిన విచారణ అనంతరం ఏసీబీ కోర్టు చంద్రబాబు నాయుడికి రిమాండ్ విధిస్తూ తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో చంద్రబాబుకు రిమాండ్ విధించడంతో పలువురు స్పందించారు ఇలా..

– కార్వేటినగరం

వందల కోట్లు దోచేశాడు..



చట్టానికి ఎవరూ చుట్టం కారని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని, అందుకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టు నిదర్శమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి కుమార్తె, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు కృపాలక్ష్మి అన్నారు. ఆదివారం రాత్రి ఆమె సాక్షితో మాట్లాడారు. అధికారం ఉన్నంతకాలం స్కిల్ స్కామ్ పేరుతో వందల కోట్లు దోచేసి సీఐడీకి అడ్డంగా దొరికిపోయారని విమర్శించారు. ప్రజాధనాన్ని నిలువునా దోచేసి 40 ఏళ్ల రాజకీయ అనుభవం అంటూ గొప్పలు చెప్పుకునే చంద్రబాబుకు శిక్ష పడడాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని చెప్పారు. తప్పు చేసిన వారికి శిక్ష పడుతుందని, దీనికి నిదర్శనం చంద్రబాబే అని విమర్శించారు.

న్యాయం గెలిచింది..



కుప్పం ఎమ్మెల్యే చంద్రబాబు నాయుడు చేసి స్కిల్ స్కాంను నిరూపించి న్యాయస్థానం ముందు నిలిపి శిక్షపడేలా చేయడంలో న్యాయం గెలిచిందని పెనుమూరు ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ అధికారం కోసం సొంతమామ ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి అధికారాన్ని చేపట్టి స్కిల్ స్కాంలో చిక్కి అరెస్టు కావడంతో ఎన్టీఆర్ ఆత్మకు శాంతి చేకూరింది. చంద్రబాబుకు 14 రోజులు రిమాండ్ విధించడం యావత్ ఆంధ్రప్రదేశ్ స్వాగతిస్తోంది. అహంభావంతో దోపిడీకి పాల్పడిన చంద్రబాబుకు కాలమే గుణపాఠం నేర్పిందని, ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారని చెప్పారు.

ప్రజాస్వామ్యం గెలిచింది..



ఆంధ్రప్రదేశ్ సీఐడీ పోలీసులు ప్రజల సొమ్ము దుర్వినియోగం అరికట్టడంలో చాకచక్యాన్ని ప్రదర్శించి ఆంధ్రప్రదేశ్ ప్రజల మద్దతు పొందారు. అలాగే రాష్ట్ర ప్రజలంతా టీడీపీ అధినేత చంద్రబాబు ఆర్భాటాలను నమ్మి మోసపోయారని, ఇక టీడీపీ నాయకుల మాటలు నమ్మితే రాష్ట్రాన్ని మళ్లీ దొల్ల కంపెనీలకు అమ్మడం ఖాయమన్నారు. షెల్ కంపెనీలకు ప్రజాధనాన్ని దోచి పెట్టాడని ఆరోపించారు. టీడీపీ నాయకులు, చంద్రబాబు నాయుడు దొంగచాటు వ్యవహారాన్ని గుర్తుంచుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి ధనుంజయ రెడ్డి అన్నారు.

పురవీధుల్లో ద్రౌపదీదేవి ఊరేగింపు


పురవీధుల్లో దర్శనమిస్తున్న ద్రౌపదీదేవి సమేత అర్జునస్వామి

పుత్తూరు రూరల్: శ్రీద్రౌపదీదేవి సమేత అర్జున స్వామి ఆదివారం పట్టణ పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఇంటింటి వద్ద కర్పూర హారతులు ఇచ్చారు. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల అనంతరం మూడవ ఆదివారం ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి పట్టాభిషేక మహోత్సవం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా తొలి రెండు ఆదివారాల్లో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషకాలు, పూజలు నిర్వహించి, పురవీధుల్లో ఊరేగించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా రెండవ ఆదివారం సాయంత్రం జరిగిన ఊరేగింపులో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ లారీమోహన్ పర్యవేక్షించారు.

కాణిపాకంలో అద్దాల మండపం వద్ద కలశ పూజలు చేస్తున్న వేదపండితులు, ధ్వజస్తంభానికి సంప్రోక్షణ చేస్తున్న ఆలయ అర్చకులు





శాస్త్రోక్తం.. సంప్రోక్షణం!


అద్దాల మండపంలో కొలువు దీరే సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన అద్దాల మండపానికి ఆదివారం ప్రారంభోత్సవం చేశారు. అందులో భాగంగా సంప్రోక్షణ పూజలు శాస్త్రోకంగా నిర్వహించారు. ప్రధాన ఆలయ ధ్వజస్తంభానికి తొడుగులుగా రాగి కలశాలను అమర్చి సంప్రోక్షణం చేశారు. అద్దాల మండపంపై కొలువుదీరిన వినాయక స్వామి విగ్రహానికి సంప్రోక్షణ పూజలు చేశారు.

– కాణిపాకం (యాదమరి)




అద్దాల మండపంపై వినాయకుని కొలువుదీర్చి, సంప్రోక్షణ చేస్తున్న వేదపండితులు, ధ్వజస్తంభానికి తొడిగే రాగి కలశం ఊరేగింపు

నగరిలో జాతర సందడి

- వైభవంగా గెరిగె ఊరేగింపు
- గ్రామదేవత ఆలయాల వద్ద పొంగళ్లు పెట్టిన మహిళలు


గెరిగ ఉత్సవం ప్రారంభిస్తున్న నిర్వాహకులు

నగరి : పట్టణంలో గంగజాతర సందడి ఆదివారం మొదలైంది. జాతర సంప్రదాయ ఆచార వ్యవహారాల్లో భాగంగా గంగమ్మ తల్లికి ప్రీతికరమైన గెరిగ ఉత్సవాన్ని తలారి వీధి గంగమ్మ గుడి వద్ద నిర్వాహకులు ప్రారంభించారు. జాతర హద్దుల్లో ఉన్న ఇళ్లకు ఊరేగింపుగా వెళ్లిన గెరిగకు పసుపు, కుంకుమల నీటితో హారతులు తీసి దర్శించుకున్న మహిళలు నైవేద్యం సమర్పించి బండారం స్వీకరించారు. గెరిగ ప్రారంభోత్సవంలో జాతర నిర్వాహకులు నరసింహారెడ్డి, సురేష్ నాయుడు, దయానిధి, చిరంజీవి రెడ్డి, ఇంద్రయ్య, మణిగండ, టీకే మదన శ్రీనివాసన్, జ్యోతిరెడ్డి, బాబురెడ్డి, రామకృష్ణారెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, పాలెగారు గోపి, సేదు, రాజేష్, రవి, విక్కీ, కుమార్, మహేష్, తిరుమల పాల్గొన్నారు.

ఆలయం వద్ద పొంగళ్లు..

నేత్రదేవత దేశమ్మ ఆలయంలో మహిళలు ఆదివారం జాతర పొంగళ్లు పెట్టారు. దీంతో ఆలయ ఆవరణ పొంగళ్లు పెట్టేవారితో నిండిపోయింది. అధిక సంఖ్యలో పొంగళ్ల కోసం పొయ్యిలు వెలిగించారు. అనంతరం పొంగళ్లను అమ్మవారి పాదుకల వద్ద ఉంచి మహిళలు నైవేద్యం సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థాన్ని కళ్లలో చల్లుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వేణుబాబు, ఈట రామచంద్రయ్య, ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అట్టహాసంగా రాధాకృష్ణుల కల్యాణం


కల్యాణోత్సవం తిలకిస్తున్న భక్తులు

శ్రీరంగరాజపురం : మండలంలోని కటికపల్లి, 49 కొత్తపల్లి గ్రామాల్లో ఆదివారం శ్రీరుక్మిణీ రాధాకృష్ణ స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలు, సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ధర్మకర్త చంద్రయ్య ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన వృద్ధులకు పాదాభివందనం చేసి వారి ఆశీస్సులు అందుకున్నారు. అలాగే భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మార్కొండయ్య, జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్ మణి, కటికపల్లి మాజీ సర్పంచ్ మణి, నాయకులు గుణశేఖర్ నాయుడు, చంద్రయ్యనాయుడు, సూరిరెడ్డి, జనార్దన్, మాధవ, అమాసయ్య, మునస్వామి, గుండాలయ్య, సుధ పాల్గొన్నారు.


స్వామివారికి పట్టువస్త్రాలు, సారె తీసుకొస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

ఓంశక్తి అమ్మవారికి అంబలి

పాలసముద్రం : మండలంలోని సింహరాజుపురం పంచాయతీ వినాయకపురం గ్రామంలో ఓంశక్తి భక్తులు ఆదివారం ఓంశక్తి అమ్మవారికి అంబలి ప్రసాదం పోసి పాలాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ప్రతి ఒక్క మహిళలు పాల బిందెలతో పంబ వాయిద్యాలతో గ్రామాల్లో ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. ప్రతిఒక్కరూ తీసుకొచ్చిన పాలబిందెలను గర్భగుడిలో ఉన్న ఓంశక్తి అమ్మవారిని ఆలయ అర్చకులు పాలాభిషేకాలు చేశారు. సాయంత్రం మహిళలు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఓంశక్తి భక్తులు తెచ్చిన నిమ్మకాయ మాల, పూజ సామగ్రి, వివిధ సుగంధ పుష్పాలతో అమ్మవారి చిత్రపటాన్ని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.


నిమ్మపండు, వివిధ పుష్పాలతో అలంకరించిన ఓంశక్తి అమ్మవారు


అమ్మవారిని అభిషేకించేందుకు పాల బిందెలతో వస్తున్న మహిళలు

అంకాళ పరమేశ్వరికి ప్రత్యేక పూజలు

పుత్తూరు రూరల్: మండల పరిధిలోని చిన్నబ్బనాయుడు కండ్రిగ గ్రామంలోని అంకాళపరమేశ్వరి ఆలయంలో ఆదివారం పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సెల్వమణి దంపతుల పేరిట వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో నగరి నియోజకవర్గం నుంచి రోజా ఎమ్మెల్యేగా రోజా హ్యాట్రిక్ విజయం సాధించాలని పూజలు చేసినట్లు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు చిరంజీవి యాదవ్ తెలిపారు. ఆదివారం గ్రామానికి విచ్చేసిన మంత్రి రోజాకు ఘనంగా స్వాగతం పలికి, ఆలయ తీర్థ ప్రసాదాలు అందజేశారు.


ప్రత్యేక అలంకరణలో అంకాళపరమేశ్వరి దేవి

కౌన్సిలర్ బాలాజీ కుటుంబానికి పరామర్శ

పుత్తూరు రూరల్: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా భరోసా ఇచ్చారు. పుత్తూరు మున్సిపాలిటీ 12వ వార్డు కౌన్సిలర్ బాలాజీ తల్లి పార్వతి ఇటీవల మృతి చెందారు. ఆదివారం మంత్రి చిన్నబ్బనాయుడు కండ్రిగ గ్రామానికి వెళ్లి పార్వతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆప్తులను కోల్పోయినా మనోధైర్యంతో ముందుకెళ్లాలని, పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని బాలాజీకి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, నాయకులు రవీంద్ర, చిరంజీవియాదవ్, ఏకాంబరం, ప్రసాద్, మునిరత్నంనాయుడు పాల్గొన్నారు.


పార్వతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి రోజా

అవినీతికి కేరాఫ్ చంద్రబాబు

శ్రీరంగరాజపురం : మన భారతదేశంలో ప్రతి ఒక్కరికీ ఒకే రాజ్యాంగం, ఒకే చట్టం ఉందని, చంద్రబాబుకు ఏమైనా ప్రత్యేకంగ చట్టాలు ఉన్నాయా ? అని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా 49కొత్తపల్లిమిట్టలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2014–18 మధ్య కాలంలో చంద్రబాబు ప్రభుత్వం భారీ కుంభకోణాలకు పాల్పడి అవినీతికి కేరాఫ్‌గా నిలిచారు. దోచుకోవడం, దాచుకోవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. నిరుద్యోగ యువతకు శిక్షణ కోసం కేటాయించిన నిధులను దారి మళ్లించడంలో చంద్రబాబుకు మించిన ఘనుడు దేశంలో ఎవరూ లేరని అన్నారు. తాను తప్పు చేయలేదని, ప్రభుత్వమే ఇరికించిందని మాట్లాడడం చంద్రబాబుకు అలవాటే అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్ మణి, మాజీ సర్పంచ్ దేవరాజులురెడ్డి, నాయకులు భూపతిరెడ్డి, జనార్దన్, యువరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిరెడ్డి